# ఆ శ

మబ్బులు పట్టిన సంధ్యాకాశంలాగ ఉంది రామనాథం మనస్సు.
ఒకకాలు విరిగిన కొయ్యకుర్చీకి అరిన అప్పడంలాగ అంటుకు పోయి కూర్చున్నాడు. తలను రెండు అరచేతులతో పట్టుకున్నాడు. ఆ తలలో ఆలోచనలు తుప్పు కత్తులతో యుద్ధం చేస్తున్నాయి. జీవితసమస్యల సంఘర్షణ జోరుగా సాగుతోంది...

పదేళ్లుగా చేస్తూన్న గుమాస్తా ఉద్యోగం పోయింది. అందుకు కారణం—వక్రించిన తన కర్మేగానీ, తను చేసిన తప్పు లేదు. తనకి ఉద్యోగమిచ్చి, తన చీకటి బ్రతుకులో చిన్న అగ్గిపుల్ల వెలిగించిన ధర్మాత్ముడు గుండె జబ్బుతో గుటుక్కుమన్నాడు. ఆయన కొడుకులు పంపకాలు తేలక, కొట్టును మూసేసి అమ్మకానికి పెట్టారు. ఫలితం: తనఉద్యోగం ఊడడం. అదొక సమస్య.

కొండవీటి చేంతాడులాంటి దీర్ఘ వ్యాధిని పెంచుకున్న కన్నతల్లిని బ్రతికించుకొనేందుకు ఆరొందలు అప్పుజేశాడు. ఆవిడ బ్రతకలేదు. అప్పుమాత్రం మూడేళ్ళలో తడిసి ముప్పందుమైంది. దానికి ఆ అప్పుదారు 'షైలాక్'లా తన రక్తమాంసాల్ని పోకడ పెట్టేందుకు ఆవురావురు మంటున్నాడు. అదింకోసమస్య.

పెద్దకూతురు పిచ్చిమొక్కలా పెరిగి పెళ్ళీడుకొచ్చి, 'నాకు మొగుణ్ణి తెస్తావా? మూడు చెరువుల నీళ్ళు తాగుతావా?' అంటూన్నది. అది మరో సమస్య.

'సర్వీసులో ఇంక్రిమెంట్లు శూన్యంగానీ, ఏటా ఓ పిల్లచొప్పున సంతానం దిగుమతి చేశావు. వాళ్ళకి తిండిపెట్టు. బట్ట కట్టు. చదువులు చెప్పించు. ఫీజులు చెల్లించు. డబ్బు చాలకపోతే తల తాకట్టుపెట్టి, అప్పులుచేయి. వాటిని తీర్చలేకపోతే అఘోరించు.' అన్నట్టు వుంది భార్యామణి ప్రవర్తన. అది ఇంకోసమస్య.

నిరుద్యోగం.

తనకోసం అప్పులిచ్చినవాళ్ళ వేట. వాళ్ళను తప్పించుకొని సందులూ గొందులూ పట్టుకు తిరగడం.

ఇంట్లో పొయ్యిమీద కుండ రోజూ వేళకు ఎక్కకపోవడం. దానితో పిల్లలగోల—ఆకలి ఆకలి అంటూ. రెండో కొడుక్కి పోలియోవల్ల కాలూ చేయీ చచ్చుబడడం వాడి గోడుకు ఇంటి గోడలు దద్దరిల్లడం.

భార్యకు మళ్ళీ నెలతప్పి మూడు నెలలైంది.

ఇదే తన వర్తమాన జీవితం!—సమస్యల తోరణం. బాధల ఈతముళ్ళు. చీకటి గుయ్యారం!

తన సమస్యలకూ, బాధలకూ, చెదలు పట్టిన బ్రతుకూక—ఒక్కటే పరిష్కారమార్గం. డబ్బు! డబ్బు పుష్కలంగా వుంటే ఈ సమస్యల కారు మబ్బులన్నీ ఇట్టే చెదిరిపోతాయి. మరి డబ్బు ఎక్కడిది? ఎవరిస్తారు? ఎక్కణ్ణుంచి వస్తుంది? తను సంపాదించలేడు. అవకాశాలు లేవు. ఈ జీవితం ఇంతే! రోజు రోజుకీ అధోగతి బాటలో జారిపోవడమే! పరిష్కారంలేదు. ఆలోచనలతో బుర్రను బ్రద్దలు చేసికోవడం, గుండెకు మురికి పట్టించుకోవడం, క్షణ క్షణమూ క్రుంగి కృశించిపోవడం—వృథా! వృథా! బ్రతుకు వ్యర్థం జీవించడం నిష్ప్రయోజనం. మరణమేమంచిది. 'జాతస్య మరణం ధ్రువమ్' అన్నారుపెద్దలు. బాధ

లతో బ్రతుకంతా ఏడ్చేకంటే, ఏడ్చే వాళ్లకేసి చూస్తూ కుమిలి పోవడం కంటే, నుదుటి మీద నిలిచిన దారిద్ర్యరేఖను తొలగించ డానికి ప్రయత్నించడం కంటే—ఆత్మహత్య అన్ని సమస్యలకూ అంతిమ పరిష్కార మార్గం

రామనాథం కుర్చీలోంచి బరువుగా లేచాడు. అంతకంటె బరువైన నిర్ణయం ఆయన మనస్సులో ఘనీభవించింది. ఉత్త రీయాన్ని వల్లెవాటుగా వేసుకున్నాడు. ఇల్లు బయలుదేరాడు.

'ఎక్కడకు పోతున్నారు?' అన్నది భార్య.

'పట్లోకి' అనుకున్నాడు రామనాథం.

'నాన్నా, నాకు చాకలెట్లు తెచ్చిపెట్టు' అన్నాడు పోలియో వచ్చిన రెండోకొడుకు.

'నాన్నా! నాకో కళ్ళపతంగ్ తీసుకురా!' అన్నాడు మూడోకొడుకు.

'నాన్నా! నాకో వేడ మల్లెపూలు...'అన్నది పెళ్ళికోసం తపిస్తూన్న పెద్దకూతురు.

'డాడీ! నాకు ఐస్‌క్రీమ్' అన్నది రెండోకూతురు.

'నాన్నా! నాకు మొక్కజొన్న కండెలు' అన్నది మూడో కూతురు.

'కోర్కెలకేం పందెపు గుర్రాలు. వాటి గిట్టలకింద దుమ్ము కూడా మనకు దక్కదు' అనుకున్నాడు రామనాథం.

వీధిన బడ్డాడు రామనాథం. గాలికి నడుస్తున్నాడు. ఆ క్షణంలో ఆయన దృష్టిలో ప్రపంచమంతా గాలిలో గడ్డిపోచతో సమానం, ఈ మేడలూ, కార్లూ, డబ్బు గలవాళ్ళూ, వాళ్ళు అనుభవించే భోగభాగ్యాలూ— అన్నీ క్షణ భంగురాలు. నీటి బుడగలు. బ్రతికేవాళ్ళు పాపాత్ములు; బ్రతకాలని ఆరాటపడే

వాళ్ళు పాప పంకిలంలో కూరుకుపోయే వాళ్ళు. చచ్చినవాళ్లు పుణ్యాత్ములు. చావాలనుకొనేవాళ్ళు స్వర్గానికి ఉన్న రాస్తాను ఎక్కబోతూన్న వాళ్ళు.

ఆత్మహత్య చేసుకోడానికి దృఢంగా నిర్ణయించుకున్న రామనాథం ఆ వీధి మలుపులో ఉన్న ఓ మెడికల్‌షాపు దగ్గరకు వెళ్ళాడు—నిద్రమాత్రలు కొనుక్కోడానికి. ఆయన్ను ఓ బిచ్చగాడు అడ్డుతగిలాడు. రేగి కంపలాంటి జుత్తు; పీక్కుపోయిన కళ్లు; చిరిగిచీరి పిట్టలు కారుతూన్న చొక్కా, పైజామా—ఇట్టే పోల్చుకోవచ్చు ప్రజల దానధర్మాలమీద బ్రతుకు బండిని దొర్లిస్తున్న అభాగ్యుడని.

'బాబూ! ఒక్క అయిదు పైసలు ఇప్పించండి.'

రామనాథం అతనికేసి రెప్పలు నిల్పి చూశాడు. లాల్చీ జేబులో చేయిపెట్టి వెతికాడు, చిల్లరలేదు. రూపాయి నోటు వుంది. దానధర్మాలు చేయడం ద్వారానే మనిషి పుణ్యం సంపాదించుకోగలడు. గతంలో తనది ధర్మంచేసిన చేయికాదు. అయినా చావబోతున్నప్పుడు ధర్మం చేస్తేనైనా పుణ్యంవొచ్చి-వచ్చే జన్మలో భోగభాగ్యాలతో తులతూగే బ్రతుకు లభిస్తుంది.

'ఇస్తా, రా!' అన్నాడు రామనాథం షాపులోకి దారితీస్తూ.

రామనాథం రూపాయ మార్చి అయిదుపైసలు బిచ్చగానికి ఇచ్చాడు. వాడి మొహం సంతోషంతో అడుగు వెడల్పయింది.

'థాంక్యూ బాబుగారూ! ప్రొద్దున్నుంచి అడుక్కుని అడుక్కుని తొంభై అయిదు పైసలు పోగుచేశాను. అయిదు పైసలు తక్కువైనాయి—లాటరీ టిక్కెట్టు కొనడానికి. రేపే డ్రా. ఫస్టు ప్రైజు మూడు లక్షల రూపాయలు. ఈసారి తప్పకుండా ఫస్టు ప్రైజు కొడతాను. ఆ డబ్బుతో మేడ కడతాను.

పెద్ద కారు కొంటాను. మంచి పిల్లను చూసి పెళ్ళిచేసుకొంటాను. జీవితంలో ఎన్నో సుఖాల్ని పొందుతాను...' అంటూ బిచ్చ గాడు చెంకలు గొట్టాడు.

రామనాథం విశ్చేష్టుడై రాతిబొమ్మలా నిలబడిపోయాడు.

ప్రక్కనే పేవ్‌మెంటుమీద ఒకాయన లాటరీ టిక్కెట్లు పర్చుకొని, 'అదృష్టం మీ చేతులలో దూకబోతోంది. ఒక్క రూపాయికి మూడులక్షల రూపాయలు. లాటరీకట్టి లక్షాధికారులు కండి!' అంటూ అరుస్తున్నాడు. అక్కడికెళ్ళాడు ఆ బిచ్చగాడు. జేబులోవున్న తొంభై అయిదు పైసలకు, ఆ అయిదుపైసలు కలిపి-ఓ లాటరీ టిక్కెట్టు కొన్నాడు ఆ బిచ్చగాడు.

రామనాథానికి తల గిర్రున తిరిగింది.

ఆ బిచ్చగానికి జీవితంపై ఎంత ఆశ?-తన ఆర్థిక సమస్య లకూ, కష్టాలకూ, దుఃఖాలకూ—ఈ ఆశ ఎందుకు ఔషధం కాకూడదు! తనూ ఓ లాటరీ టిక్కెట్టు కొంటే! తనకి రాకూ డదా ఆ మూడు లక్షల ప్రైజు? ఆ డబ్బు వస్తే—తన బ్రతు కెంత సుఖపడుతుంది? అప్పులన్నీ తీర్చి, తనూ మేడకట్టవచ్చు. ఇంపాలా కారు కొనవచ్చు. బ్యాంకు నిల్వలు పెంచుకోవచ్చు. స్వర్గ నరకాలమధ్య స్వప్నమే జీవితం!

రామనాథం గబుక్కున లాటరీ టిక్కెట్లు అమ్మే దుకాణం దగ్గరకు వచ్చాడు, హరివిల్లులాంటి ఆశ నిండిన మనస్సుతో.

'ఎంతోయ్ టిక్కెట్టు?' అన్నాడు కొత్త ఉత్సాహంతో.

'ఒక్క రూపాయి బాబుగారూ!'

నీళ్ళు కారిపోయి, రామనాథం అరిచేయి విప్పాడు. అరి చేతిలోవున్న తొంభై అయిదు పైసల చిల్లరడబ్బులు ఏడ్పు మొహంతో చూశాయి.

(ఆంధ్ర సచిత్ర వార పత్రిక)